క్లుప్తంగా

విశేషాలంకారంలో గంగమ్మ తల్లి



పొదలకూరు: పట్టణంలో కొలువైన గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగళ్లను మహిళా భక్తులు పెట్టారు. ఇటీవల గంగమ్మ తల్లి తిరునాళ్లను మూడు రోజుల పాటు నిర్వహించడంతో నెల పొంగళ్లను బాణసంచా, తప్పెట్లతో వెళ్లి పెట్టుకున్నారు.

చవటపాళెంలో ఫీవర్ సర్వే



సాక్షి ఎఫెక్ట్..

వెంకటాచలం: మండలంలోని చవటపాళెం, కాకుటూరు గ్రామాల్లో ఫీవర్, లార్వా సర్వేను కసుమూరు పీహెచ్‌సీ సిబ్బంది ఆదివారం నిర్వహించారు. 'వైద్యసేవలు మృగ్యం' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఇంటింటి సర్వేను నిర్వహించాలని కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవల్లిక ఆదేశించారు. దీంతో చవటపాళెం, కాకుటూరు గ్రామాలకు వెళ్లి ఇంటింటి సర్వేను నిర్వహించారు. జ్వరాలు రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

వెంకటాచలం: మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ కల్పన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుద్ధ్య తదితర సమస్యలపై సమీక్షించనున్నామని వివరించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ప్రహరీకి నోచుకోని పాఠశాల



పొదలకూరు: మండలంలోని నావూరు జెడ్పీ హైస్కూల్‌కు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా స్కూల్ బిల్డింగ్‌కు రిపేర్లను చేపట్టారు. ప్రహరీ నిర్మాణానికి అంచనాలు రూపొందించే సమయంలో ఎన్నికలు రావడంతో వాయిదా పడింది. సుమారు పదెకరాల స్థలాన్ని పాఠశాలకు కేటాయించడంతో ప్రహరీ నిర్మించాలంటే నిధులను బాగా వెచ్చించాల్సి ఉండటంతో అధికారులు సైతం వెనుకడుగేస్తున్నారు. ఈ క్రమంలో పశువులు, కుక్కలు పాఠశాలలోకి ప్రవేశిస్తున్నాయి.

బీజేపీ మండల స్థాయి సమావేశం



పొదలకూరు: స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల ఇన్‌చార్జి శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని వివిధ సేవా కార్యక్రమాలను అక్టోబర్ రెండు వరకు నిర్వహించాలని సూచించారు. నేతలు చింతగింజల చినసుబ్రహ్మణ్యం, చొప్పా వెంకటేశ్వర్లు, రవీంద్రబాబు, దాసరి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం: మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గాలో భక్తుల సందడి ఆదివారం నెలకొంది. భక్తులతో దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

హైవే క్రాసింగా.. వామ్మో

హైవేలను క్రాస్ చేయడం ప్రాణ గండంగా మారింది. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతూ.. ఎంతో మంది ప్రాణాలు ఇప్పటికే గాల్లో కలిసిపోయాయి. తాజాగా రామన్నపాళెం క్రాసింగ్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అయినా హైవే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

- నిత్యం భయం..భయం
- అవసరమైన ప్రాంతాల్లో ఫ్లయ్‌ఓవర్లేవీ..?
- రామన్నపాళెం క్రాసింగ్‌లో తాజాగా యువకుడి మృతి



ప్రాణాలను బలిగొంటున్న రామన్నపాళెం హైవే క్రాసింగ్

కొడవలూరు: కొడవలూరు మండల పరిధిలో జాతీయ రహదారి 25 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇందులో ఆరు ఫ్లైఓవర్లను నిర్మించారు. అయితే అవసరమైన చోట ఇవి లేకపోవడంతో ప్రమాదాలు నిత్య కృత్యమవుతున్నాయి. మండలంలోని రామన్నపాళెం, చంద్రశేఖరపురం, టపాతోపు వద్ద క్రాసింగ్‌లు ప్రాణసంకటంగా మారాయి.

ప్రాణాలు పోతున్నాయ్

రామన్నపాళెం వద్ద గల హైవే క్రాసింగ్‌కు ఎంతో ప్రాధాన్యముంది. తూర్పునకు వెళ్లే రోడ్డు మండలంలోని రామన్నపాళెం, మానేగుంటపాడు, ఆలూరుపాడు, రెడ్డిపాళెంలతో పాటు పార్లపల్లి మీదుగా విడవలూరుకు వెళ్లేందుకు మార్గం. అందువల్ల ఇక్కడి క్రాసింగ్ వద్ద నిత్యం ద్విచక్ర వాహనాలు, కార్లు, పాదచారులు క్రాసింగ్ దాటుతుంటారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా బుధవారం ఇక్కడి రోడ్డు క్రాసింగ్ చేస్తున్న బైక్‌ను హైవేపై వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. వేగంగా వచ్చిన మోటార్ సైక్లిస్ట్ జార్ఖండ్‌కు చెందిన యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా రోడ్డు క్రాస్ చేస్తున్న బైక్‌లోని రామన్నపాళెం సచివాలయ ఉద్యోగిని కరుణ, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. అంతకు రెండు నెలల ముందు టపాతోపునకు చెందిన దివ్యాంగుడు ఇక్కడే రోడ్డు క్రాస్ చేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగి మృతిచెందారు. ఇలా తరచూ నెలలో ఒక ప్రమాదమైనా ఇక్కడి క్రాసింగ్ వద్ద జరుగుతూనే ఉంది. అయినప్పటికీ హైవే అథారిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎన్నో పర్యాయాలు ఇక్కడ ఫ్లైఓవర్ లేదా అండర్ పాస్ నిర్మించాలని ఆందోళనలు చేశారు. ఆ సమయంలో హైవే అధికారులు వచ్చి నిర్మాణానికి చర్యలు తీసుకొంటామని చెబుతున్నారే తప్ప కార్యరూపం దాల్చడం లేదు.

అవసరమైనా పట్టని హైవే అధికారులు



చంద్రశేఖరపురం క్రాసింగ్ వద్ద ప్రమాదకరంగా దాటుతున్న ద్విచక్ర వాహనదారులు

చంద్రశేఖరపురం రోడ్డు క్రాసింగ్ నుంచి పడమర వైపునున్న రోడ్డున వెళ్తే పెయ్యలపాళెం గ్రామం ఉంది. ఇక్కడి నుంచి అనేక గ్రామాలకు లింకు రోడ్ల సదుపాయం ఉంది. ఈ గ్రామం మీదుగా మండలంలోని గండవరం, సంగాయపాళెంల మీదుగా బుచ్చిరెడ్డిపాళెం వరకు దగ్గరి మార్గంలో వెళ్లవచ్చు. అదేవిధంగా పెయ్యలపాళెం నుంచి ఉత్తరం వైపునున్న లింకు రోడ్డులో వెళ్తే దగదర్తి మండలానికి వెళ్లవచ్చు. అంతేకాకుండా చంద్రశేఖరపురంలో ఏపీఐఐసీ వారు ఇండస్ట్రీయల్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. అందులో ఇప్పటికే జీడి పప్పు ప్రాసెసింగ్ ప్లాంట్ నడుస్తుండగా, మిథాని పరిశ్రమ రానుంది. అదేవిధంగా ఇక్కడ క్రిబ్స్ బయో కెమికల్ ఫ్యాక్టరీ, పెయ్యలపాళెం వద్ద ఆల్ఫా రొయ్యల పరిశ్రమ, రెండు తవుడు ఫ్యాక్టరీలు, ఏకలవ్య గురుకుల పాఠశాల, కళాశాల ఉన్నాయి. అందువల్ల పెయ్యలపాళెం రోడ్డుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. నిత్యం పెద్ద వాహనాలతో పాటు ద్విచక్ర వాహనదారులు ఇక్కడ దాటుతుంటారు. దీనివల్ల హైవేపై వేగంగా వెళ్లే వాహనాలు రోడ్డు క్రాస్ చేస్తున్న వారిని ఢీకొడుతున్నాయి. గతేడాది తవుడు ఫ్యాక్టరీ యజమానుల కారును ఢీకొట్టగా భార్యభర్తలు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. ఇక్కడ అప్పటికే ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకొన్నారు. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని చంద్రశేఖరపురం వాసులు పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా చేశారు. శవాన్ని రోడ్డుకడ్డంగా పెట్టి నిరసన తెలిపారు. ఆ సమయంలో హైవేపై అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ స్తంభించి పోయింది. అయినప్పటికీ హైవే అధికారులు పట్టించుకోవడం లేదు.



ఐదు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన జార్ఖండ్ యువకుడు



రామన్నపాళెం క్రాసింగ్ వద్ద తీవ్రంగా గాయపడిన యువకుడు

ప్రాణ సంకటంగా టపాతోపు క్రాసింగ్

టపాతోపు హైవే క్రాసింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అనేక గ్రామాలకు కూడలి ప్రాంతమైన నార్తురాజుపాళేనికి వెళ్లాలన్నా, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలకు వెళ్లాలన్నా ఈ క్రాసింగ్ ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉండడంతో నిత్యం క్రాసింగ్ వద్ద పదుల సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలు దాటుతుంటాయి. ఆయా సమయంలో హైవేపై వేగంగా వచ్చే కార్లు వేగం అదుపు కాక వాహనదారులను ఢీకొంటున్నాయి. ప్రతి నెలలో ఒక ట్రెండు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో తీవ్రంగా గాయపడుతుంటే కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోతున్నాయి. ఇక్కడా ఫ్లైఓవర్ నిర్మించకపోవడం గమనార్హం.

శవంతో నిరసన చేసినా పట్టించుకోలేదు



చంద్రశేఖరపురం క్రాసింగ్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ఫ్లైఓవర్ నిర్మించాలని హైవే అధికారులను అనేక పర్యాయాలు కోరాం. పట్టించుకోకపోవడంతో క్రాసింగ్ వద్ద ప్రమాదంలో మృతిచెందిన గ్రామ వాసి మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి గ్రామస్తులంతా నిరసన తెలిపాం. ఆ సమయంలో కలెక్టర్ సహా కదలి వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ అమలు కాలేదు. ఇక్కడ ప్రమాదాలు తగ్గాలంటే ఫ్లైఓవర్ నిర్మించడం తప్ప మరో మార్గం లేదు.

– తలతోటి ప్రసన్నకుమార్, చంద్రశేఖరపురం, కొడవలూరు మండలం

అండర్ పాస్ నిర్మించినా ఊరటే



రామన్నపాళెం క్రాసింగ్ వద్ద జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా కనీసం అండర్ పాసైనా నిర్మించాలని బాధిత గ్రామాల వారంతా కలిసి హైవే ఉన్నతాధికారులను కోరాం. ఆందోళనలు కూడా చేపట్టాం. ఆందోళన చేసినప్పుడు మాత్రం అండర్ పాస్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ తరువాత పట్టించుకోలేదు. దీంతో ఇక్కడ ప్రమాదాలు మామూలయ్యాయి.

– కాకి శ్రీనివాసులు, రామన్నపాళెం, కొడవలూరు మండలం

ప్రజల ప్రాణాలకు విలువ లేదు



టపాతోపు క్రాసింగ్ ప్రమాదాలకు నెలవుగా మారింది. ఈ క్రాసింగ్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంది. హైవే నుంచి నార్తురాజుపాళేనికి, టపాతోపు మీదుగా కొడవలూరుకు వెళ్లేందుకు దగ్గరి మార్గం కావడం వల్ల అందరూ ఈ క్రాసింగ్‌నే ఆశ్రయిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే క్రాసింగ్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని కోరితే పూర్తిగా క్రాసింగ్‌ను మూసి వేస్తామంటున్నారు. కనీసం అండర్ పాస్ నిర్మించైనా ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– జి.జనార్ధన్‌రెడ్డి, నార్తురాజుపాళెం, కొడవలూరు మండలం

ఉపాధ్యాయులకు సత్కారం



పొదలకూరు: ఉత్తమ ఉపాధ్యాయులను అపస్మా ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా వారికి జ్ఞాపికలను అందజేశారు. సర్వేపల్లి, రాపూరులో అపస్మా పరిధిలో పనిచేస్తున్న పలు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 56 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. 2025 డీఎస్సీలో ఉద్యోగం పొందిన ఏడుగుర్ని సత్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అపస్మా రాష్ట్ర అధ్యక్షుడు తులసీ విష్ణుప్రసాద్, ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, సురేష్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రతిఒక్కరూ చదవాలని 'త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి జ్ఞానవేదిక' సభ్యులు కోరారు. మండలంలోని వడ్డిపాళెం, నాగమాంబాపురం గ్రామాల్లో త్రైత సిద్ధాంతం గురించి ఆదివారం ప్రజలకు వివరించారు. కృష్ణాష్టమి విశిష్టత, కృష్ణుని ఊరేగింపు విధానం తదితర విషయాలు ప్రజలకు వివరించారు. అనంతరం త్రైత సిద్ధాంత ప్రతులను అందజేశారు. సభ్యులు సురమౌళి, రామయ్య, ప్రవీణ, విజయమ్మ, కావ్యశ్రీ, అవినాష్, శేఖర్, రమ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

నెల్లూరు సిటీ: నారాయణ హాస్పిటల్ గేటు బయట నిలిపిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితుడు ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన అక్బర్‌బాషా ఈనెల 11న నారాయణ హాస్పిటల్‌లో మెడికల్ చెకప్‌కు వచ్చారు. బైక్‌ను ఆస్పత్రి గేటు బయట పార్కింగ్ చేసి చెకప్ చేయించుకుని బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో సమీప ప్రాంతాల్లో వెతికినా లాభం లేకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాపై ఎందుకీ కక్ష..!

- జగనన్న కాలనీ వాసుల ఆవేదన
- వర్షమొస్తే అధ్వానంగా మంగలికట్ట
- కనీస సదుపాయాలు కరవు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 13, 16 వార్డులకు సంబంధించి మంగలికట్ట జగనన్న కాలనీలో సుమారు 750 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు ఇక్కడ స్థలాలు కేటాయించడంతో వారు ఇళ్లు కూడా నిర్మించుకున్నారు. ఈ లోపు సాధారణ ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టడంతో కాలనీపై నీలి నీడలు అలుముకున్నాయి. కాలనీ ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా వీధిలైట్లు కూడా వేయలేదని ఆదివారం కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు విలేకరులతో తాము ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను తెలియజేశారు. తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని. సీసీరోడ్లు నిర్మించకపోవడం, మురుగునీరు వెళ్లేందుకు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో ఏ వీధిలో చూసినా మురుగు పారుతోందని వివరించారు. వర్షాకాలంలో నేపథ్యంలో మోకాలిలోతు నీటిలో ప్రజలు జీవనం సాగించాల్సి ఉంటుంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షానికే వీధుల్లో వర్షపు నీరు, మురుగునీరు ఏకమై ప్రవహిస్తున్నాయి. ఈ కారణంగా దోమలు విపరీతంగా పెరిగి మలేరియా, డెంగీ తదితర వ్యాధులకు ప్రజలు గురయ్యే అవకాశం ఉండటంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.



చిన్న వర్షానికే కాలనీ మధ్యలో నిల్వచేరిన వర్షపునీరు

పందుల సంచారం

కాలనీలో మౌలిక సదుపాయాల లేమి ఒక ఎత్తయితే నిత్యం పందుల గుంపులు కాలనీల్లో యథేచ్ఛగా తిరుగుతుంటాయి. చిన్నారులు, వృద్ధులపై పందులు దాడులు చేసిన ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. ఇళ్ల మధ్య మురుగు గుంతల్లో ఆవాసం ఏర్పాటు చేసుకొని అక్కడి నుంచి కదలడం లేదు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని వారు వాపోతున్నారు.

వీధి దీపాలు లేక అవస్థలు

కాలనీలో వీధిదీపాలను ఏర్పాటు చేయకపోవడంతో గుంతలమయంగా ఉన్న వీధుల్లో రాత్రి వేళల్లో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. చీకటిని ఆసరాగా చేసుకొని దొంగలు చెలరేగిపోతున్నారు. నిత్యం కాలనీలో ఏదోఒక ఇంట్లో చోరీ జరుగుతూనే ఉంటుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రాత్రిపూట మహిళలు, చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే హడలిపోతున్నారు. విష సర్పాలు, పురుగులు వీధుల్లో తిరగడం ఇక్కడ నిత్యకృత్యం. వీటికి తోడు చీకటి ప్రాంతాల్లో యువత మద్యం సేవించడం, జూదం లాంటివి ఆడుతుండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉందని వివరించారు.

ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం శూన్యం

కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యేకు సమస్యలు ఏకరువు పెట్టారు. చూద్దాం చేద్దాం అంటూ ఆమె వెళ్లిపోయారని వారు అంటున్నారు. కనీసం ఇప్పటికైనా స్పందించి తమ కాలనీ సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



వీధి దీపాలు, సీసీరోడ్డు లేక ఇలా...



ఓ ఇంటి ముందు మురుగు, వర్షపునీరు చేరడంతో మహిళ అవస్థలు

మౌలిక వసతులు లేవు



కాలనీలో మౌలిక సదుపాయాలు లేవు. దీనికి తోడు మందుబాబుల బెడద కూడా అధికంగా ఉంది. నగర పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– అవ్వారి సరస్వతి, మంగలికట్ట కాలనీ

వ్యాధులు వ్యాపించే అవకాశం



వర్షాకాలం నేపథ్యంలో కాలనీలో నీరు నిలిచి పోతోంది. దీనివల్ల దోమలు ఎక్కువై వ్యాధుల వ్యాప్తి జరుగుతోంది. నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి

– సీహెచ్ అత్తమ్మ, స్థానికురాలు

పందులతో సహవాసం



కాలనీలో నిత్యం పందులతో సహవాసం చేయాల్సి వస్తోంది. పందులు తమ పిల్లలను ఎక్కడ దాడి చేస్తాయోనని భయంగా ఉంది. అధికారులు స్పందించి పందులను తరలించాలి.

– బి.ప్రమీలమ్మ, స్థానికురాలు

బాలల ఆశ్రమానికి రూ.2.25 లక్షల విరాళం



కొడవలూరు: మండలంలోని టపాతోపు విశ్వజనని బాలల ఆశ్రమానికి కోవూరుకు చెందిన గాదిరాజు నాగేశ్వరరావు రూ.2.25 లక్షల విరాళమిచ్చారు. ఈ నగదుతో నిర్మించిన సెక్యూరిటీ గది, ప్రహరీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ఆశ్రమ అభివృద్ధికి మరింత తోడ్పాటునందిస్తామని పేర్కొన్నారు. దాత కుటుంబీకులు గాదిరాజు సుధాకర్, కల్యాణ చక్రవర్తి, ఆశ్రమ నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, సాగర్ పాల్గొన్నారు.

ఎఫ్‌ఎన్‌ఓల నియామకంలో జాప్యం తగదు



కొడవలూరు: ఆయుష్ శాఖలో ఎఫ్‌ఎన్‌ఓ(ఫిమేల్ నర్స్ ఆర్డినరీ)లుగా పనిచేస్తున్న వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం గత నెల 12న జీఓ నంబర్ 503ని విడుదల చేసినప్పటికీ ఇప్పటివరకు జాప్యం చేయడం తగదని మండలంలోని దామేగుంటకు చెందిన ఎఫ్‌ఎన్‌ఓ ఆర్.లలిత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో డాక్టర్లు లేని ఆయుష్ వైద్య కేంద్రాల్లోని ఎఫ్‌ఎన్‌ఓలను తొలగించారన్నారు. అనేక పర్యాయాలు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో ఎట్టకేలకు ఎఫ్‌ఎన్‌ఓలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని జీఓ విడుదల చేశారని తెలిపారు. అయితే ఇప్పటివరకు నియామకాలు చేపట్టలేదన్నారు. మరో పక్క ఎఫ్‌ఎన్‌ఓల వయో పరిమితి దాటిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి నుంచి క్రీడా ఎంపికలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నేడు, రేపు పలు క్రీడా పోటీలకు సంబంధించి క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి బీవీ రమణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 17 ఏళ్లలోపు ఉన్న బాలబాలికలు పాల్గొన వచ్చన్నారు. నెట్‌బాల్, బీచ్ వాలీబాల్ క్రీడలకు సంబంధించి బుచ్చిరెడ్డిపాళెం డీఎల్ఎన్నార్ పాఠశాలలో, ఫెన్సింగ్ గేమ్ ఎంపికలు బుచ్చిరెడ్డిపాళెం రెయిన్‌బో స్కూల్లో, షూటింగ్ గూడూరులో, టెన్నీస్ కావలి జెడ్పీ హైస్కూల్లో, వెయిట్ లిఫ్టింగ్, జూడో గేమ్స్ ఎంపికలు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94902 30435, 94929 36165 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కోడి పందేలపై దాడి

కోవూరు: పోతిరెడ్డిపాళెం పరిధిలో పెన్నానది ఒడ్డున కోడి పందేల స్థావరాలపై పోలీసులు ఆదివారం మెరుపు దాడి నిర్వహించారు. ఐదుగురిని అరెస్ట్ చేసి, ఎనిమిది మోటార్ బైక్‌లు, ఆటో, మూడు కోడి పుంజులు, రూ.1,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు. సిబ్బంది వేణు, సునీల్, వేణు పాల్గొన్నారు.